## ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం



రక్తదానం చేస్తున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, అక్టోబర్ 20 : పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎస్పీ సింధూశర్మతోపాటు 63 మంది పోలీసులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. సుమారు 63 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ ప్రకాశ్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, కార్యదర్శి రఘుకుమార్, జిల్లా కోఆర్డినేటర్ నరసింహం, డివిజన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

రాజంపేట్, అక్టోబర్ 20 : రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రాజంపేట ఎస్సై సంపత్ సూచించారు. ఈ నెల 21వ తేదీన పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో రక్తదాతల సేవా సమూహ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రాజంపేట ఎస్సై సంపత్ రక్తదానం చేశారు. రక్తదానం చాలా గొప్పదని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలు, వ్యాపారులు సహకరించాలి

బాన్సువాడ, అక్టోబర్ 20 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు, వ్యాపారులు సహకరించాలని బాన్సువాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో భుజంగరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల్లో వెళ్లేవారు రూ. 50 వేలకు మించి ఒక్క రూపాయి కూడా ఎక్కువగా తీసుకెళ్లొద్దని పేర్కొన్నారు. మేకలు, గొర్రెల కొనుగోలు, కూరగాయలు తదితర చిరు వ్యాపారులు, రైస్‌మిల్లర్స్, పెట్రో పంపుల యజమానులు చెక్కులు లేదా డీడీలు ద్వారా చెల్లింపులు చేసుకోవాలని సూచించారు. 50 వేల రూపాయలకన్నా ఎక్కువగా ఉంటే స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఎంతటి వారైనా కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఎమర్జెన్సీ అయితే అంబులెన్స్‌లో వెళ్లేవారు సంబంధిత దవాఖాన పత్రాలను చూపాల్సి ఉంటుందని, పత్రాలను పరిశీలించిన తర్వాత పంపుతారని తెలిపారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



జనగామ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై సాయిరెడ్డి, సిబ్బంది

బీబీపేట్, అక్టోబర్ 20 : ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై సాయిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జనగామ రోడ్డులో ఎస్సై సాయిరెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రభాకర్, పోలీస్ సిబ్బంది రంజిత్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

## మైసమ్మ ఆలయంలో పూజలు

నస్రుల్లాబాద్, అక్టోబర్ 20 : నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులోని మైసమ్మ ఆలయంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో వన భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

# ర్యాండమైజేషన్‌గా పోలింగ్ సామగ్రి కేటాయింపు

### కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, అక్టోబర్ 20 : ఎన్నికలకు సంబంధించిన కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు మొదటి ర్యాండమైజేషన్ పూర్తి అయిన తర్వాత స్ట్రాంగ్ రూంలలో భద్రపరచాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నా రు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 6,61,163 మంది ఓటర్లున్నారని, 791 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు 25 శాతం, వీవీ ప్యాట్లు 40 శాతం అదనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి ర్యాండమైజేషన్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఆటోమెటిక్‌గా నియోజకవర్గం పోలింగ్ బూత్ వారీగా ఏఏ యంత్రాలు కేటాయించాలో జనరేట్ చేసిన జాబితాను అందజేస్తూ శనివారం ఉదయం 8 గంటల వరకు ఏఎంఎం గోదాంలకు రావాలని కోరారు. అక్కడ నియోజకవర్గం వారీగా జనరేట్ చేసిన జాబితా ప్రకారం కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ఆయా నియోజకవర్గాలకు గట్టి భద్రత మధ్య తరలించి అక్కడ ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామని అన్నారు. రెండో దఫాలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలిం గ్ సిబ్బంది ర్యాండమైజేషన్ జరుగుతుందని, నవంబర్ 28న మూడో ర్యాండమైజేషన్‌లో కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేస్తామని తెలిపారు. పోలింగ్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఏజెంట్లు ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ సమయంలో ఏం చేయాలో తగు శిక్షణ ఇవ్వాలని తహసీల్దార్లకు సూచించారు. ముంద స్తు అనుమతి లేకుండా ప్రకటనలు, వాహనాలు, సభలు, సమావేశాలు ఏర్పాటు, డబ్బు పంపిణీ, తాయిలాలు ఇవ్వడం వంటివి దృష్టికి వస్తే వెంటనే తెలుపాలన్నారు, లేకుంటే అభ్యర్థి ఖర్చు కిందకు వెళ్తుందని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన అసత్య వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, అభ్యంతరకర పోస్టులు ఉండకూడదని చెప్పారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## బీఆర్ఎస్‌లో చేరిక

మాచారెడ్డి, అక్టోబర్ 20 : మండలంలోని ఎల్లంపేట గ్రామపరిధిలో ఉన్న తండాల్లో వివిధ పార్టీలకు చెందిన 200 మంది కార్యకర్తలు ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్సింగ్ రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టో సామాన్య ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరేలా ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎంపీపీ నర్సింగ్‌రావు

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్

బీబీపేట్, అక్టోబర్ 20 : మండలంలోని ఇస్సానగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దాగం నారాగౌడ్ గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బాధిత కుటుంబాని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు సర్పంచ్ కవిత తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్, మాజీ సర్పంచ్ రమణాగౌడ్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

## ఫొటో, వీడియోగ్రఫీ పోటీలకు ఆహ్వానం

కామారెడ్డి, అక్టోబర్ 20 : పోలీసుల అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, ప్రజలకు సంవత్సర కాలంలో పోలీసులు చేసే విధులు వివిధ అంశాలపై పోటీల నిర్వహణ ఉంటుందని ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో తమ ఫొటోలు, వీడియోలను పొందుపరిచి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో వీడియోగ్రఫీ పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫొటోలు లేదా రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసులు చేసిన సేవ ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు ఎక్కువ కాకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలన్నారు. ప్రతిభ కనబర్చిన మొదటి మూడు ఫొటోలు, వీడియోలకు జిల్లాలో బహుమతి ప్రదానం చేస్తూ రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. వీడియోలను https://forms.gle/FkB8qy9wypw PVP8 ఈ నెల 26వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం శ్రమించి అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నిర్వహిస్తున్న పోటీలకు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి, అక్టోబర్ 20 : రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సైన్స్ అధికారులుగా పని చేస్తున్న డీఎస్‌వోలు శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పరిశోధన సంస్థలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి సైన్స్ అధికారుల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పదవిలో రెండేండ్లపాటు కొనసాగుతామని అన్నారు. విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రతిబింబించేలా పాటుపడతామని అన్నారు.

## కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కామారెడ్డి, అక్టోబర్ 20 : జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల సోషల్ మీడియాలో వేరే పార్టీలో చేరుతున్నట్లు అవుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని అన్నారు. తాము ఏ పార్టీలో చేరలేదని, తాము ఎక్కడా కూడా వేరే పార్టీలో చేరుతున్నట్లు చెప్పలేదని అన్నారు. అప్పుడు, ఎప్పుడు కూడా బీఆర్ఎస్ పార్టీ కోసమే పని చేశామని తెలిపారు. కామారెడ్డిలో కేసీఆర్ పోటీ చేయడం తమ అదృష్టమని అన్నారు. కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. దీనిని అవకాశంగా తీసుకొని కొన్ని సోషల్ మీడియాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, వారికి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి చెంపపెట్టు సమాధానం చెబుతామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయ్‌భాస్కర్ గౌడ్, కన్నయ్య, అంజల్ రెడ్డి, రాజు, భూక్యా రాజ్, ఇల్లందుల వేణు, రవీందర్ గౌడ్, మామిండ్ల రమేశ్, నాయకులు ప్రసాద్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.